ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పరిహారం సమస్య పట్టదా..!

◆ డిఎల్.పురంలో పట్టాదారులకు అందని డబ్బులు ◆ విసిఐసి భూ సేకరణ, పరిహారం చెల్లింపులో మతలబులు
◆ కాగిత తరహాలో చెల్లించాలని పేదల డిమాండ్ ◆ లేదంటే భూమి తీసుకోబోమని హామీ ఇవ్వాలని పట్టు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

జిల్లాలోని నక్కపల్లి మండలంలో విశాఖ-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు తొలి నుంచీ సవ్యంగా జరగడంలేదు. ఏపి పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించిన జిరాయితీ, డి పట్టా, సాగు భూములు, చెట్లు, ఇళ్లకు సరిగా నష్ట పరిహారం చెల్లించలేదు. భూ సేకరణ గ్రామాల్లో పరిహార నిర్ణయంలో సరైన పద్ధతి పాటించలేదు. కొంతమందికి చెల్లించాల్సిన పరిహారం కంటే ఎక్కువ జమచేసి తిరిగి రాబట్టుకోలేక.. మిగిలిన రైతుల భూములకు పరిహారం చెల్లించని పతిస్థితి ఉంది. చాలాచోట్ల డి పట్టా భూములకు పరిహారం చెల్లించి, చెట్లకు డబ్బులు వేయలేదు. సాగు భూములకు పరిహారం ఇవ్వకుండానే పనులు మొదలుపెట్టారు. డిఎల్.పురంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం క్యాప్టివ్ పోర్టుకు కేటాయింపులో భూమి పోతున్న పేదలకు పరిహారం చెల్లించకుండా అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. పరిహారం చెల్లింపుపై ప్రతిపాదనలు పంపినట్లు కొన్ని సంవత్సరాలుగా చెబుతూ వస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం డిఎల్.పురంలోని 10 మంది పేదలకు 20.33 ఎకరాల్లో ఎల్‌సిసి పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి పేదల సాగులో భూమి ఉంది. జీడి మామిడి తోటలు సాగుచేసుకొని బతుకుతున్నారు. విసిఐసి కింద భూములు తీసుకుంటున్నట్లు 2010లో నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ పరిహారం ఇవ్వలేదు. డిఎల్.పురం సర్వే నెంబర్ 211/1, 202/2, 202/3, 203/4, 191/2సి, 192/2బి, 192/2సి, 192/3, 205/2ఎ, 205/2సిలో డి పట్టా భూములకు పరిహారం చెల్లించకుండా అధికారులు తిప్పుతున్నారు. చుట్టూవున్న జిరాయితీ భూములకు పరిహారం జమచేసిన అధికారులు పేదల డి పట్టా భూములకు నష్ట పరిహారం చెల్లించలేదు. పేదల భూములకు చెందిన పరిహారం కొంతమంది జిరాయితీ రైతుల పేరిట జమకావడంతో ఆ డబ్బులు తిరిగి అధికారులు రాబట్టలేకపోతున్నారు. ఒకదశలో పోలీసుల సమక్షంలో రహదారి పనులు చేపట్టడానికి ప్రయత్నం చేశారు. బాధిత పట్టాదారులు పనులు అడ్డుకోవడంతో వారి పొలాల హద్దు వరకు మిగతా 2లో..



డిఎల్.పురంలో పరిహారం అందని పేదల పట్టా భూములు

కుట్టుతో మహిళలకు స్వయం ఉపాధి

◆ జిల్లాలో 27 కేంద్రాల్లో 3058 మందికి శిక్షణ
◆ 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీదేవి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోంది. స్వచ్ఛందంగా టైలరింగ్ నేర్చుకోవడానికి వేల సంఖ్యలో మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ కుట్టు మెషిన్‌ల శిక్షణా కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. విశాఖ జిల్లాలోని పలు కేంద్రాల్లో కుట్టు శిక్షణలో మహిళలు ట్రైనింగ్ పొందుతున్నారు. బయట టైలర్ వద్దకు చిరిగిపోయిన క్లాత్ తీసుకెళ్లి కుట్టించాలంటే మహిళలు కనీసం రూ.50 చెల్లించాల్సి వస్తుంది. ఇంట్లోనే స్వయంగా ఉపాధి పొందేలాగ రాష్ట్ర ప్రభుత్వం బిసి మహిళల కోసం శిక్షణా కేంద్రాలను బిసి సంక్షేమ శాఖ ద్వారా నడుపుతోంది' అని విశాఖ జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి కె.శ్రీదేవి వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..





మహిళలకు శిక్షణ ఎలా ఇస్తున్నారు? ఎంత కాలం ఉంటుంది?

విశాఖ జిల్లాలో బిసి మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు 3596 మందిని లక్ష్యంగా చేసుకున్నాం. దరఖాస్తులు మాత్రం 19811 మహిళల నుంచి వచ్చాయి. 3058 మందిని గుర్తించి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నాం. మిగతా 510 మందికి సంబంధించిన జాబితాలు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రావాల్సి ఉంది. జిల్లా మొత్తంగా 27 కేంద్రాలు లక్ష్యంకాగా 19 ప్రారంభమయ్యాయి. ఒక్కో కేంద్రంలో 25 కుట్టు మిషన్లను అందుబాటులో ఉంచడం జరిగింది. ప్రతి కేంద్రంలో ఒక టీచర్, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారు. శిక్షణా సమయం ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ ఒక సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మరో సెషన్ ఉంటాయి. ఇలా 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి మిగతా 2లో..

హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటాం

▶ వార్త 5లో..

జాయ్ జమీమా కేసులో కీలక ముఠా సభ్యుడు అరెస్ట్

▶ వార్త 2లో..

సాలూరు శ్యామలాంబ ఉత్సవానికి ప్రత్యేక బస్సులు

▶ వార్త 2లో..



విశాఖలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల తాకిడి

ప్రశాంతంగా జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, ఆనందపురం : దేశంలో ఐఐటిలు, తత్సమాన విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలు విశాఖలోని 10 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా సాగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరిపారు. ఆనందపురం మండలంలోని నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) కళాశాలలో ఈ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శంభు ప్రసాద్ తెలిపారు. తమ పరీక్షా కేంద్రంలో 200 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 194 మంది హాజరయ్యారన్నారు. అన్ని సౌకర్యాలూ కల్పించామన్నారు.



పెదగంట్యాడలో సాగుతున్న బైకు ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు



వడ్లపూడి పరిసర ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

ఉక్కు సమ్మె జయప్రదానికి బైకు ర్యాలీలు

ప్రజాశక్తి - గాజువాక, ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను, కార్మికుల తొలగింపులను వ్యతిరేకిస్తూ, కార్మిక సంఘాల నాయకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్లు విధించడం వంటి నిరంకుశ విధానాలను ఖండిస్తూ ఈ నెల 20 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో జరిగే కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెను, 20న జరిగే కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలంటూ గాజువాక నియోజకవర్గంలోని ఉక్కు నిర్వాసిత కాలనీల్లో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆదివారం బైకు ర్యాలీలు సాగాయి. పెదగంట్యాడ జంక్షన్ వద్ద బయలుదేరిన ఓ బైక్ ర్యాలీ నిర్వాసిత కాలనీలైన అయ్యన్నపాలెం, సిద్దేశ్వరం, కోనవారిపాలెం, అయ్యన్నపాలెం, యాతపాలెం మీదుగా పెదగంట్యాడ జంక్షన్‌కు చేరుకుంది. మరోపక్క అగనంపూడి, దిబ్బపాలెం, కొండయ్యవలస, బీసీ కాలనీ, డొంకాడ, వడ్లపూడి, రాసాలమ్మ కాలనీ, కూర్మన్నపాలెం ప్రాంతాల్లోనూ బైకు ర్యాలీలు సాగాయి. పెదగంట్యాడలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సమ్మెలో పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

మొదటి పేజీ తరువాయి..

పరిహారం సమస్య పట్టదా..!

రోడ్డు పనులు చేశారు.

2024 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌డేలో పరిహారం చెల్లింపుపై బాధితులు చేసిన ఫిర్యాదుపై అర్హుల వివరాలతో ప్రతిపాదనలు పంపినట్లు గత ఏడాది అక్టోబర్ 9న నక్కపల్లి తహశీల్దార్ నరసింహమూర్తి ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ప్రభుత్వ రికార్డుల్లో పేదల పేర్లు నమోదైవున్నాయి. కానీ పరిహారం మాత్రం ఇవ్వకుండా జాప్యం చేయడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేదలకు చెందాల్సిన పరిహారాన్ని అధికార పార్టీకి చెందిన వారు బినామీల పేర్లను నమోదుచేసి జేబులు నింపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క కాగిత, పాటిమీద, వేంపాడులో సాగు భూములకు ఇటీవల రూ.40 నుంచి రూ.45 లక్షల మధ్య పరిహారం ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. ఆ గ్రామాల రైతులకు పరిహారం ఇస్తున్నట్టు క్యాప్టివ్ పోర్టులో కోల్పోతున్న తమ భూములకు కూడా పరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. పరిహారం చెల్లించకపోతే తమ భూములను విసిఐసిలో తీసుకోబోమని లిఖితపూర్వకంగా హామీ పత్రం ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఒకవైపు భూములు తీసుకుంటామని బెదిరిస్తూ, మరోవైపు పరిహారం చెల్లించకుండా బాధితులను తిప్పడంపై న్యాయస్థానాన్ని బాధితులు ఆశ్రయించాలని చూస్తున్నారు.

కుట్టుతో మహిళలకు స్వయం ఉపాధి

ఆ తర్వాత పెర్ఫార్మెన్ చేసే మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తాం.

శిక్షణా కాలంలో పారితోషికం ఏమైనా ఉంటుందా?

ఒక ట్రైనింగ్ సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.21 వేలు కేటాయించింది. దీంట్లో ట్రైనింగ్ ఇచ్చేవారికి రూ.15599ను గౌరవ వేతనంగా అందిస్తారు. ఒక షూయింగ్ మెషిన్ ఖరీదు రూ.6199గా నిర్ణయించారు. నేర్చుకోడానికి వచ్చే మహిళలకు శిక్షణ ఉచితం. 90 రోజుల శిక్షణానంతరం కుట్టు మిషన్‌ను ప్రతి మహిళకూ ఇస్తాం. అయితే 70 శాతం హాజరు ఉన్నవారే కుట్టు మిషన్ స్వీకరణకు అర్హులు.

నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు ఎలా వచ్చాయి?

భీమునిపట్నం పరిధిలో మొత్తంగా 536 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఆనందపురం 107, భీమునిపట్నం 108, పద్మనాభం 107, జోన్ 1 నుంచి 107, జోన్ 2 నుంచి 107 దరఖాస్తులు ఉన్నాయి. గాజువాక నుంచి 510, పెందుర్తి నుంచి 510, తూర్పు నియోజకవర్గం నుంచి 510, పశ్చిమం 510, ఉత్తరం 510, దక్షిణం 510 దరఖాస్తులు వచ్చాయి. వీరంతా బిసి మహిళలు.

పహల్గాం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన కాల్పులు, మృతుల విషయమై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. అల్లిపురంలోగల నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆదివారం ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ యుద్ధం వద్దు, శాంతి కావాలని, అపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని అర్ధాంతరంగా ముగించడానికి రహస్య కారణాలేంటో ప్రజలకు చెప్పాలని ఆయన అన్నారు. సభలో పార్టీ విశాఖపట్నం, విజయనగరం కమిటీ కార్యదర్శి ఎమ్.వెంకటేశ్వర్లు, నాయకులు యు.వెంకటేశ్వర్లు, వై.కొండయ్య, పిఒడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కనక మహాలక్ష్మి దుర్గ అమ్మవారి పండగ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ, గొల్ల వీధి పరిసర గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పేరొందిన శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి దుర్గ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మూడు రోజులు పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు. నిర్వహించనున్నారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. ఆరాధన సేవలు జరిగాయి. ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పోలారావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ శ్రీను, సెక్రటరీ మువ్వల నరేష్ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

జాయ్ జమీమా కేసులో కీలక ముఠా సభ్యుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో సంచలం సృష్టించిన జాయ్ జమీమా కేసులో కీలక ముఠా సభ్యుడైన రత్నరాజును అరెస్టు చేసినట్టు విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయ్ జమీమా చాలా మంది పురుషులకు వల వేసి, మత్తుమందు, స్త్రీలతో లోబరుచుకుని మత్తులో ఉన్న సదరు పురుషులతో అశ్లీల ఫొటోలు తీసుకుని తదుపరి సదరు పురుషులను బెదిరించి లక్షలలో డబ్బు డిమాండ్ చేసిన విషయాన్ని వారు ప్రకటనలో గుర్తుచేశారు. అలాకాని పక్షంలో వివాహితుల భార్యలకు విడాకులు ఇప్పించడం, తనని పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడం, అందుకు అంగీకరించనిచో భారీగా నగదు, బంగారం వారి నుండి దోచుకోవడం, లేని పక్షంలో వారిని బందించి, హత్యాయత్నాలకు ప్రయత్నించేదని అధికారులు తెలిపారు. ఐదు సంవత్సరాల నుండి విశాఖ నగరంలో కొందరితో కలిసి పలు వ్యవస్థీకృత నేరాలకు పాల్పడి, సంఘంలో ఉన్నతమైన స్టానంలో ఉన్న వ్యక్తులను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. ముఠాలో ప్రధాన వ్యక్తులు అయిన జాయ్ జమీమా, బచ్చు వేణుభాస్కర్ రెడ్డి, అవినాష్ బెంజమన్‌లను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఆ ముఠాలో మిగతా కీలక సూత్రధారుడు, పాత్రధారుడు అయిన గ్లోబల్ ఐటిసి కంపెనీ సిఇఒ పొలమరసెట్టి రత్నరాజును ఎయిర్‌పోర్టు ఏరియాలో భీమిలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు.

జనావాసాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జనావాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఆదివారం టౌన్ కొత్త రోడ్డు దరి చెంగలరావు పేట పంజా జంక్షన్ వద్ద పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం నాయకులు కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇదే ప్రాంతంలో 8 సంవత్సరాల క్రితం సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజానీకం ఏకమై అనేక నిరసన కార్యక్రమాల ద్వారా సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేశారని గుర్తుచేశారు. మళ్లీ అదే ప్రాంతంలో అధికారులు సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో పిల్లలు చదువుకునే పాఠశాలలు ఉన్నాయని, గర్భిణులకు విశాఖపట్నంలో ప్రసిద్ధి చెందిన గోషా హాస్పిటల్ ఉందని తెలిపారు. సెల్ టవర్ రేడియేషన్ ప్రభావం వల్ల పిల్లలు, పెద్దలు, గర్భిణులు ఇబ్బందులకు గురవుతారని అనేక నివేదికలు చెబుతున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ ప్రాంతాన్ని సందర్శించి, సెల్ టవర్ ఏర్పాటు నిలిపివేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. నిరసన కార్యక్రమంలో సెల్ టవర్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, సుబ్బారావు, అప్పన్న, వై.రాజు, కెవిపి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు శ్యామలాంబ ఉత్సవానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాలూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఉత్సవాలకు విశాఖ నుంచి 100 ప్రత్యేక బస్సులను ఆదివారం నుంచి నడుపుతున్నామని, ఈ నెల 22వ తేదీ వరకు అవి నడుస్తాయని ఎపిఎస్ ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విశాఖపట్నం డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అందరికీ ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈనెల బీట్ ద హీట్ థీమ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శ్రీ శ్యామలాంబ అమ్మవారి జాతరకు ఏర్పాటు చేసిన బస్సులను ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా సరస్వతి పుష్కరాలు సందర్భంగా సూపర్ లగ్జరీ బస్సులను ఆర్‌టిసి నడపనుందని, కావలసినవారు వారి టూర్ ప్రోగ్రాంతో పాటు డిపిఎస్ కాంప్లెక్స్‌లో 9958225602, 8309265666, 7382914264 నెంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే 22న ఆన్ లైన్‌లో కూడా రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

22వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 22వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ, కార్యదర్శి స్వాతి మాట్లాడారు. అనురాధ, శోభ, మోజెస్, సునీత, కల్పన, రూప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతి

అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 21 రోజులుగా దీక్ష చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తొమ్మిది నెలలుగా ప్రభుత్వం పిఎఫ్ నిలిపేసిందని, ఇంక్రిమెంట్, ఎఫ్‌ఆర్‌ఎస్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

దీనిపై కొణతాల సానుకూలంగా స్పందించి సిహెచ్‌ఒల సమస్యను అతి త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రం మొత్తం 10,052 మంది సిహెచ్‌ఒలు సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని వేడుకున్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవిపి.కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో రెండు రోజుల పాటు నిర్వహించిన విశాఖపట్నం ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. అండర్-9, అండర్-11, అండర్-13, అండర్ - 15, అండర్ - 17 పురుషుల, మహిళల విభాగాల్లో నిర్వహించిన ఈ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సుమారు 108 మంది ఆటగాళ్ళు పాల్గొన్నారు. విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ డివిఎస్‌వై.శర్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలోని జివిఎంసి మూడో జోన్, 17వ వార్డు, పెదవాల్తేరు దళయివారి వీధిలో ప్రజల వినియోగం, సౌకర్యం కోసం జివిఎంసి నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, విఎమ్‌ఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలిసి ఈ కార్యక్రమంలో మేయర్ పాలుపంచుకున్నారు. జోనల్ కమిషనర్ కె.శివ ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ పద్మావతి, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఫార్మా ఆధ్వర్యాన చలివేంద్రం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం పక్కనున్న గ్లోబల్ ఫార్మసీ ఏర్పాటు చేసిన తాగునీటి శిబిరాన్ని ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇనస్పెక్టర్లు శ్రీనివాసరావు, అభిప్రాయ, కళ్యాణి, ఫార్మసీ నిర్వాహకులు రవి కుమార్, శ్రీశ్రీ ఇన్‌ఫ్రా ఎమ్‌డి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గ్లోబల్ ఫార్మసీ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

రైతుబజార్‌లో 'ఆవకాయ' సందడి

మామిడి కొనుగోలుతో రద్దీ


మామిడి కాయలను ముక్కలుగా చేస్తున్న రైతు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతు బజార్‌లో గత కొద్దిరోజులుగా ఆవకాయ సందడి నెలకొంది. ఈ నెల ఆరంభం నుంచి మామిడికాయలు పోగులుగా అమ్ముతున్నారు. ఆ పక్కనే ఆవకాయ కోసం ముక్కలు కొట్టే పని ప్రారంభమైంది. ఊరగాయ పెట్టాలనుకునే మహిళలు వీటిని కొనుగోలు చేయడం ప్రారంభించారు. సీతమ్మధార రైతు బజార్‌లో ప్రస్తుతం వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతులు తోటల నుంచి కాయలు కోసి రైతు బజార్‌కు తీసుకొస్తున్నారు. దెబ్బతినని కాయలను ప్రత్యేకంగా ఎంచి ఆవకాయ కోసం విక్రయిస్తున్నారు. ఒకపక్క కాయల విక్రయం, మరో పక్క పచ్చడికి ముక్కలు కొట్టే వారితో రైతు బజార్ ఉదయం నుంచి సందడిగా కనిపిస్తోంది. ఆవకాయ తయారీకి అవసరమైన కారం, బెల్లం, ఉప్పు, ఇతర దినుసులను సైతం రైతుబజార్‌లోనే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. కలెక్టర్ కాయలు, కొత్తపల్లి మామిడి, కొబ్బరి మామిడి వంటి రకాలు లభ్యమవుతున్నాయి. కొత్తపల్లి మామిడి, కోలం గోవా, కలెక్టర్ మామిడి కాయలకు మంచి డిమాండ్ ఉంది. కాయలు రకాన్ని బట్టి కిలో రూ.35 నుంచి రూ.55 వరకు విక్రయిస్తున్నారు. పచ్చడి కాయల కోసం చాలామంది నిరీక్షించి కొనుగోలు చేస్తున్నారు. పచ్చడి కాయలను ముక్కలుగా కొట్టేందుకు ప్రతి కాయకు రూ.3 చొప్పున వసూలు చేస్తున్నారు. ఆవకాయ పచ్చడి కోసం మామిడి కాయలను ఎక్కువగా కొనుగోలు చేయడంతో రైతులు మామిడికాయలును ఎక్కువగా తెస్తున్నారు.

రైతు బజార్‌లో ఏ స్టాల్‌లో చూసినా అధికంగా మామిడికాయలు, పండ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి జనం ఎగబడుతున్నారు. మామిడి పండ్లకు సంబంధించి బంగినపల్లి సువర్ణరేఖ రసాలు, నూజివీడు రసాలు రైతు బజార్‌కు వస్తున్నాయి. కిలో రూ.80 నుంచి రూ.100 వరకు రైతులు విక్రయిస్తున్నారు. మామిడి పక్వానికి రాకముందే రసాయనాల ద్వారా పండించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రైతులు మాత్రం గడ్డి, ఇతర సంప్రదాయం మార్గాల్లో మగ్గబెట్టి పండ్లను విక్రయిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొన్న కారు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఇరువురు గాయపడ్డారు. నక్కపల్లి నుండి తలుపులమ్మ లోవకు ఆటోలో నలుగురు వెళ్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విశాఖపట్నం నుండి తుని వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురు గాయపడ్డారు. పెద్ద ప్రమాదం నుండి బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట శివారు ప్రాంతంలో జీడి తోటలో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఈ దాడిలో 6 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుండి రూ.39,810లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పశువుల నీటి తొట్టెలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : పశువుల దాహార్తి తీర్చేందుకు మండలంలోని సింగనబంద, మర్రి చెరువు వద్ద నిర్మించిన నీటి తొట్టెలను సర్పంచ్ జివి.నారాయణతో కలిసి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.ఎల్లయ్య, టి.పైడిరాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. సరస్వతి నృత్య కళా మందిర్ చిన్నారులు ప్రదర్శనలిచ్చారు. గణనాయక, శుక్లం భరదరం, శుద్ధ బ్రమ్మ, ముకుంద ముకుంద, వేణుగానం, జైజనార్ధన వంటి గేయాలకు వాగ్దేవి, గ్రీష్మ, సృజన, మౌనిక, జోషణ, రుచిక, నమ్రత, యువన, పుష్పాంజలి చేసిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి.ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి పర్యవేక్షించారు.

పలుచోట్ల తిరంగా యాత్ర

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన బాజీ జంక్షన్ నుంచి ఎన్ఎడి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆపరేషన్ సింధూరులో పాల్గొని సెలవులపై నగరానికి వచ్చిన సైనికులను, మాజీ సైనికులను గణబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమలత, టిడిపి నాయకులు మౌర్య సింహ, దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆపరేషన్ సిందూర్ పేరిట జరుగుతున్న సైనిక పోరాటానికి విశాఖ కళాకారులు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు వారంతా చేరుకుని 'టెర్రరిజం నశించాలి, సైనికులకు సలాం సలాం' అంటూ పెద్దపెట్టున నినదించారు. కళా సంఘాల ప్రతినిధులు యాక్మీ ప్రతాప్, సన్ మూర్తి, భయ్యా శ్రీనివాస్, బొడ్డేటి జగత్‌రావు, చెన్నా తిరుమలరావు, వి.నాంచారయ్య, మను పల్లా పాల్గొని గాంధీ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు పరశురామ్ రాజు మాట్లాడారు.

బయోటెక్నాలజీ పరిశోధనలకు డిబిటి సహకారం

గీతంలో బైరాక్ సలహాదారు ప్రొఫెసర్ శర్మ

ప్రజాశక్తి-మధురవాడ : బయోటెక్నాలజీ రంగంలో పరిశోధనలకు భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం (డిబిటి) వివిధ కార్రక్రమాల ద్వారా సహకారం అందిస్తోందని, విశ్వవిద్యాలయాలలోని పరిశోధకులు సామాజిక ప్రయోజనం కలిగించే పరిశోధనా ప్రాజెక్టులను ఎంచుకుని డిబిటికి దరఖాస్తు చేసుకోవాలని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బైరాక్) చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ పికెఎస్.శర్మ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు, పరిశోధకులతో ఆయన సమావేశం అయ్యారు. బయోటెక్నాలజీ విభాగం ప్రత్యేకంగా స్పర్శ్ (సోషియల్ ఇన్నొవేషన్ ప్రోగ్రామ్ ఫర్ ప్రోడక్ట్స్: అఫార్డబుల్ అండ్ రిలెవెంట్ టు సోసైటల్ హెల్త్) పేరిట సమాజ అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ఇన్నొవేటివ్ ఉత్పత్తులు లేదా సేవలను అభివృద్ధి చేసే 'సోషియల్ ఇన్నొవేటర్స్' వర్గాన్ని తీర్చిదిద్దడంపై దృష్టి సారించిందని ఆయన వెల్లడించారు. దీనికి అనుగుణంగా రీసెర్చి ప్రాజెక్టులకు పరిశోధకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేస్ (ప్రొమోటింగ్ అకడమిక్ రీసెర్చ్ కన్వర్షన్ టు ఎంటర్‌ప్రైజ్) పేరుతో సామాజికంగా, జాతీయస్థాయి విలువ గల సాంకేతికతలు లేదా ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి విశ్వవిద్యాలయాలలోని అధ్యాపకులను ప్రోత్సహిస్తూ, ఇండస్ట్రీ భాగస్వాముల ద్వారా వాటిని ప్రామాణికరించుకునే అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా దేశంలో బయోటెక్నాలజీ రంగంలో సామాజికంగా ప్రభావ వంతమైన పరిశోధనలను పెంపొందించాలన్నది బైరాక్ సంకల్పమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ వివిధ రకాల ఫండింగ్ అవకాశాలను సమగ్రంగా వివరిస్తూ డిబిటి వెబ్‌సైట్లలో రెగ్యులర్, స్పెషల్ ఫండింగ్ కాల్స్‌ను పరిశీలించాలని అధ్యాపకులను ఉత్సాహపరిచారు. అనంతరం డాక్టర్ శర్మను గీతం ఇన్‌చార్జి వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సత్కరించారు. గీతం సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ గణపతిరావు, ప్రొఫెసర్ రాజా పప్పు, ప్రొఫెసర్ భరతం, ప్రొఫెసర్ జివిఆర్.శర్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ శరను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

పోటీ పరీక్షలకు శిక్షణ


మాట్లాడుతున్న రామజోగినాయుడు

ప్రజాశక్తి-ఆనందపురం : ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు ఎంఆర్‌జె నాయుడు ఉషాదేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లాంగ్ టైం ఎంసెట్ కోచింగ్‌తో పాటు ఇంటర్ డిగ్రీ ట్యూషన్, అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ ఎం.రామజోగినాయుడు తెలిపారు. వేములవలస పాత మహోదయ జూనియర్ కళాశాల భవనం వద్ద ఆదివారం ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ముచ్చర్ల రామజోగినాయుడు సలహాతో వారి కుమారుడు ముచ్చర్ల జ్యోతి ఆదిత్య స్వరూప్ సారథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామజోగినాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో మహోదయ జూనియర్ కళాశాల ఏర్పాటుచేసి 30 సంవత్సరాల్లో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దామన్నారు. ఇటీవల తన సతీమణి ఉషాదేవి కాలగమనం చెందడంతో ఆమె జ్ఞాపకార్థం ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉషాదేవి జ్ఞాపకార్థం ట్రస్ట్ ద్వారా లాంగ్ టర్మ్ ఎంసెట్ కోచింగ్‌తో పాటు డిగ్రీ, ఇంటర్ ట్యూషన్, అన్ని రకాల పోటీ పరీక్షలకు అతి తక్కువ ఫీజుతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తామన్నారు. ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ విద్యను అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహోదయ విద్యా సంస్థల చైర్మన్ దొంతల రమేష్, సలహా మండలి సభ్యులు బోధ ఆదినారాయణ, కార్పొరేటర్ పులి రాజు, టిడిపి నాయకుడు బొట్ట శ్రీను, మహోదయ మాజీ డైరెక్టర్లు పతివాడ రమణ, మీసాల అప్పలరాజు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- ఆనందపురం : రౌడీ షీటర్లు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ఆనందపురం సిఐ చింత వాసునాయుడు తెలిపారు. ఆదివారం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రౌడీషీటర్లు ఎటువంటి తగాదాల్లో తలదూర్చకూడదన్నారు. దీన్ని విస్మరిస్తే పీడీ యాక్ట్ ద్వారా నగర బహిష్కరణ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వారం వారం తప్పనిసరిగా స్టేషన్‌లో హాజరుకావాలని చెప్పారు.

విలువలతో కూడిన విద్యే 'శ్రీముద్ర' ధ్యేయం

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీ నుంచి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే ధ్యేయంగా శ్రీముద్ర స్కూల్ ప్రారంభించామని పాఠశాల డైరెక్టర్లు కాకర సురేష్, పల్లి వీరాస్వామి, చైర్మన్ కె.లహరి తెలిపారు. మండలంలోని ఆనందపురం పంచాయతీ పరిధి బోని రోడ్డును ఆనుకొని శ్రీముద్ర పాఠశాలను ప్రారంభించి నర్సరీ నుంచి 7వ తరగతి వరకు విలువలతో కూడిన విద్యను గ్రామీణ స్థాయిలో అందిస్తున్నామన్నారు. ఇప్పటికే బీపీ కల్లాల రోడ్డులో ప్లే స్కూల్ ది ఐ - స్కూల్ పేరిట ప్రారంభించి 120 మంది చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పిస్తున్నామన్నారు. స్టేట్, సిబిఎస్ఇ సిలబస్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు కరాటే, యోగా, వ్యాయామ ఉపాధ్యాయులచే పలు ఆటల్లో శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం ఉందన్నారు. ముఖ్యంగా ఐటిబిపి పిల్లలకు ప్రత్యేకమైన సిబిఎస్ఇలో శిక్షణ ఇస్తున్నామన్నారు


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -గాజువాక : నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2010-11 సంవత్సరం 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అందరూ భావోద్వేగానికి గురై సంతోషం వ్యక్తం చేశారు. ఇక నుంచి ఏటా అందరం ఒకచోట కలుసుకొని కష్టసుఖాలు పాలు పంచుకుంటామని పూర్వ విద్యార్థులు చెప్పారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాచలం నాయుడు, భాస్కర్, రాజకుమార్, సురేష్, శ్రీనివాస్, వీర్రాజు, రాజలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కళానగర్ పార్కు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి కళానగర్‌లో నూతనంగా నిర్మించిన పార్కును కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జివిఎంసి నిధులు రూ.48 లక్షలతో పార్కును నిర్మించినట్లు తెలిపారు. కాలనీలో మరికొన్ని సమస్యలను గుర్తించానని, వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, ఈ కార్యక్రమంలో నాగోతి శివాజీ, పల్లా నాగేశ్వరరావు, దుక్క వెంకటరావు, నాగోతి అఖిల్, నరవ చంటి పిళ్లా శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ 95 మందికి తనిఖీచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత ఈ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 88వ వార్డు పరిధి గొల్లజగ్గరాజుపేట అంగన్‌వాడీ సెంటర్‌లో రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత అంటే ఏమిటి, రక్తహీనత లక్షణాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆకుకూరలు, రాగుల ప్రాముఖ్యత గురించి కిషోర్ బాలికల తల్లులకు సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జ్యోతిశ్రీ, శ్రీలక్ష్మి, శ్రావణి, దివ్య అవగాహన కల్పించారు. రాగి పిండితో లడ్డులు తయారు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో గొల్లజగ్గరాజుపేట, కాపుజగ్గరాజుపేట, ఫకీర్ తకియా అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగిన 'ఉక్కు' దీక్షలు


ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. ఆదివారం నాటికి దీక్షలు 1557 రోజులు పూర్తి చేసుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌కు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు.



బొడ్డు నర్సింహపాత్రుడును సన్మానిస్తున్న మేయర్ పీలా

సామాజిక సేవ చేయాలి : మేయర్ పీలా

ప్రజాశక్తి -గాజువాక : ప్రజా సేవతో పాటు సామాజిక సేవ చేసినప్పుడే ఏ నాయకుడికైనా సమాజంలో గుర్తింపు లభిస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పుట్టినరోజు సందర్భంగా దయాల్‌నగర్‌లోని ఆయన నివాసంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేయర్ పాల్గొని మాట్లాడుతూ, విశాఖ నగరాభివృద్ధిలో కార్పొరేటర్ల పాత్ర చాలా కీలకమన్నారు. కూటమి పాలనలో విశాఖ మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. నిరంతరమూ వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న నరసింహపాత్రుడు ప్రజా సేవలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, దల్లి గోవింద్, రాజాన రామారావు, తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్, బొండా జగన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బొత్సకు జ్ఞాపికను బహూకరిస్తున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి -గాజువాక, ఉక్కునగరం : శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణను జివిఎంసి 87వ వార్డు వైసిపి నాయకులు ఆదివారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ, పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరినీ వైసిపి గుర్తుంచుకుంటుందన్నారు. త్వరలోనే నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర కమిటీలు వేస్తామని తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, కర్రి నాగేశ్వరరావు, గుంట్ల శ్రీను, వాండ్రాసి సన్యాసిరావు, మార్పు గోవిందా, సిరా త్రినాథ్ యాదవ్, రాంబిల్లి రాజు ఉన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకటించారు. వ్యవసాయ మోటార్ ఫీడర్ల పనుల నిర్వహణ కోసం పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 2.30 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తగ్గిన వ్యాపారాలు

స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల తొలగింపు, జీతాల్లో కోత ప్రభావం

గాజువాకలో మూతపడిన హోటళ్లు, షాపులు



60 అడుగుల రోడ్డులో మూతబడిన షాపులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం, ఉద్యోగుల తొలగింపు, జీతాల్లో కోత తదితర ప్రభావం గాజువాక మార్కెట్‌పై పడింది. చిన్న వ్యాపారాల నుంచి పెద్ద వ్యాపారాల వరకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒకప్పుడు చిన్న పంచాయతీగా ఉండే గాజువాక విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం తర్వాత పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. అనుబంధంగా ఆటోనగర్‌లో చిన్న పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఉద్యోగాల నిమిత్తం గాజువాకకు వచ్చి చాలామంది స్థిరపడ్డారు. దీంతో గాజువాక దినదినప్రవర్ధమానమైంది. రాష్ట్రంలోనే తలసరి ఆదాయంలో నెంబర్-1గా నిలిచింది. ఇంతవరకు బాగానే ఉన్నా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలతో గాజువాక ఆర్థికాభివృద్ధి మసకబారుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం, ఉద్యోగుల తొలగింపు, జీతాలు చెల్లించని స్థితి కల్పించడంతో క్రమంగా గాజువాకలో వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. గడిచిన రెండేళ్లలో వ్యాపారాలు జరక్క కుదేలవుతున్నారు. చాలామంది వ్యాపారులు గాజువాకలో బతకలేక వేరే ప్రాంతాలకు తరలి వెళ్లిపోతున్నారు. వస్త్ర వ్యాపారులు పనిచేసేవారికి నెలవారి జీతాలు చెల్లించలేక, మరి కొన్ని షాపులు నెలవారి అద్దెలు కట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అడ్వాన్సులతోనే చలామణి అవుతున్నారు తప్ప నెలవారి వచ్చే ఆదాయం కోల్పోతున్నారు. ఒకప్పుడు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు వచ్చేవి. ఇప్పుడు ఆ జీతాలు లేకపోవడంతో వారిలో కొనుగోలు శక్తి పడిపోయింది. దీంతో వస్త్ర రంగం దెబ్బతింది.

గాజువాక 60 అడుగుల రోడ్డులో రెండేళ్ల క్రితం ఒక షాపు కావాలంటే రూ.5 లక్షల అడ్వాన్సు, నెలకు రూ.50 వేలు చెల్లించాల్సి వచ్చేది. అయినా షాపులు దొరకడం కష్టమయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి కానరావడంలేదు. గత ఆరు నెలలుగా ఇదే రోడ్డులో నాలుగు షాపులు మూతపడ్డాయి. మూతపడిన వాటిలో రెండు హోటళ్లు, మరో రెండు షాపింగ్‌మాళ్లు ఉన్నాయి. ఆరు నెలలుగా ఆ షాపులను అద్దెకు తీసుకునేవారే కరువయ్యారు. వ్యాపారాలు లేక ఉన్న షాపులే ఖాళీగానే ఉంటుంటే కొత్తగా ఇంకెవరు తీసుకుంటారంటూ పలువురు వ్యాపారులు అంటున్నారు. బీసీ రోడ్డులో కళకళలాడే బంగారు షాపులు నేడు వెలవెలబోతున్నాయి. గతంలో 50 బంగారం షాపులు ఉండేవి. ప్రస్తుతం 20 షాపులకే పరిమితమయ్యాయి. ఇక్కడ మూసేసిన వారంతా వేరే ప్రాంతాలకు వలస పోయారు.

స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు వచ్చి గాజువాక మార్కెట్‌లో ఎక్కువగా పండ్లు కొనుగోలు చేసేవారు. గతంతో పోలిస్తే పండ్ల అమ్మకాలు తగ్గాయి. సరుకు తెచ్చిన మూడు రోజులైనా అమ్మకం జరగటం లేదని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం, ఉద్యోగుల తొలగింపు ప్రభావం తమపై తీవ్రంగా పడిందని రోడ్లపై పండ్లు అమ్ముకునే వ్యాపారస్తులు అంటున్నారు. పువ్వులు అమ్ముకునే చోటే కట్టలో అమ్ముకునే పరిస్థితి దాపురిస్తోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తగ్గిన పండ్ల అమ్మకాలు

గతంలో నాలుగైదు రకాల పండ్లను అమ్మేవాడిని. ఉదయం 9 గంటలకు వస్తే రాత్రి 9 గంటలకు పూర్తిగా పండ్లను అమ్మి ఇంటికి వెళ్లేవాడిని. ప్రస్తుతం తెచ్చిన సరుకు మూడు రోజుల వరకు అమ్మకాలు జరగటం లేదు. స్టీల్‌ప్లాంట్ ప్రభావం మా వ్యాపారాలపైనా పడింది.



కనక,
పండ్ల వ్యాపారి
పాత గాజువాక

కిరణా వ్యాపారమూ అంతంతే...

మా కిరాణా షాపునకు ఎక్కువగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు వచ్చేవారు. గత ఏడాది వరకు వ్యాపారం బాగా జరిగింది. ప్రస్తుతం వ్యాపారం పూర్తిగా పడిపోయింది. దినసరి కూలీలు, ప్రయివేటు కార్మికులే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. జీతాలు లేక స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల్లో కొనుగోలు శక్తి పడింది. దీంతో వ్యాపారం పెద్దగా జరగడంలేదు.



కిరణ్,
కిరాణా వ్యాపారి
గాజువాక

సుందరయ్య జీవితం యువతకు మార్గదర్శకం



సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం జోన్ కార్యదర్శి జగన్

ప్రజాశక్తి- పెందుర్తి : స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి యువతకు మార్గదర్శకం అని వక్తలు పేర్కొన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా గోపాలపట్నం జోన్ పరిధిలోని కార్మికనగర్, చైతన్య నగర్ ప్రాంతాలలో ఆదివారం సభలు నిర్వహించారు. ఈ సభల్లో సిపిఎం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, సుందరయ్య నిస్వార్ధ సేవాభావాన్ని వివరించారు. భారత పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పటికీ ఆయన జీవితం నిరాడంబరంగా సాగిందన్నారు. సైకిల్ పైనే తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండేవారని తెలిపారు. తన స్వంత భూమిని పేదలకు పంచిపెట్టిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావు, జోన్ కమిటీ సభ్యులు శంకరరావు, వెంకటలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు రామారావు, గోపి, ప్రభు, ఈశ్వరరావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. పలువురు కార్మిక సంఘాల నాయకులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ఉమామహేశ్వరరావుకు చెక్కును అందిస్తున్న ఎంఎస్ఎన్.ప్రసాద్

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నంలోని లయన్స్ కేన్సర్ జనరల్ హాస్పిటల్ వ్యవస్థాపక ట్రస్టీ, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎమ్ఎస్ఎన్.ప్రసాద్ తన 93వ పుట్టినరోజు సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి రూ.1,00,000 విరాళం అందించారు. లయన్స్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావుకు చెక్కును అందజేశారు.

నల్లి ధర్మారావుకు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు ఏటా అందిస్తున్న సాహితీ పురస్కారం ఈ ఏడాది శ్రీకాకుళానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ కవి, రచయిత నల్లి ధర్మారావుకు ప్రదానం చేశారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన పురస్కార సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఆచార్య మురు ముత్యాలనాయుడు చేతుల మీదుగా నల్లి ధర్మారావుకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడుతున్న వారిని గౌరవించడం గొప్ప విషయం అన్నారు. సభాధ్యక్షులు చందు ట్రస్ట్ చైర్మన్, యుపిఎస్‌సి మాజీ సభ్యులు ఆచార్య కెఎస్.చలం మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం సాహిత్య అభివృద్ధికి పాటుపడుతున్న నల్లి ధర్మారావుకు ఈ అవార్డు ఇవ్వడం సముచితమన్నారు. పురస్కార ప్రదాత ఆచార్య చందు సుబ్బారావు ప్రసంగిస్తూ సాహిత్యం, సైన్స్ మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు. పురస్కార గ్రహీత నల్లి ధర్మారావును ట్రస్ట్ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పరిచయం చేశారు. నల్లి ధర్మారావు రచనలను, సాహితీ కృషిని సభకు పరిచయం చేశారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ, తెలుగు భాషా ప్రగతిని వివరించారు.

అవార్డు పురస్కార గ్రహీత నల్లి ధర్మారావు మాట్లాడుతూ చందు సుబ్బారావు హృదయాన్ని గెలవడం తన అదృష్టమన్నారు. తెలుగు భాషను ఇంకా భావజాలం సమస్య వెంటాడుతోందని, దాని నుంచి బయట పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. వెనుకబాటుతనం ఉన్న చోట తిరుగుబాటు ఉంటుందన్నారు. నిజమైన చరిత్ర ఎవరూ మాట్లాడడం లేదన్నారు. 'మసిపూసిన చెక్కిలిపై' అనే స్వీయ గేయాన్ని పాడి వినిపించారు. డాక్టర్ డివి సూర్యారావు చందు సుబ్బారావు రచనలు, సాహిత్య విమర్శలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.హనుమంతరావు, పి.ఎ.రాజు, బసుపోతన, హరి వెంకటరమణ, గరిమ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



నల్లి ధర్మారావును సత్కరిస్తున్న అతిథులు

హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటాం

విల్లంబులతో కొత్తూరు, చింతలపూడి గ్రామస్తుల వినూత్న నిరసన



విల్లంబులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి - దేవరాపల్లి : చింతలపూడి, మారిక గ్రామాలు మధ్యన అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డు కుంటామని గిరిజనులు స్పష్టం చేశారు ఆదివారం కొత్తూరు చింతలపూడి గ్రామాల్లో గిరిజనులు సంప్రదాయ విల్లంబులు పట్టుకుని నిరసన తెలిపారు.వీరికి సంఘీభావం తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మాట్లాడుతూ, అదానీ లూప్ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులిచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అడవి బాట పట్టడమంటే, అడవులను తాకట్టు పెట్టడం కాదన్నారు గిరిజనులు బతుకులు నాశనం చేయడానికి అడవిబాట పట్టినట్లు.స్పష్టమౌతోందన్నారు రైవాడకు నీళ్ల వచ్చే జీవనది శారదా నదిపై ప్రాజెక్టులు కడితే రైతులకు సాగునీటికి తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. వేపాడ మండలం కరకవలస పంచాయతీ శివారు మారికలో 213 ఎకరాల్లో హైడ్రోపవర్ పవర్ ప్లాంట్లు నిర్మాణం చేయాలన్న ప్రభుత్వ చర్యలను అక్కడ గిరిజనులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. గిరిజనుల మనోభీష్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎటువంటి పనులు చేపట్టినా తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. హైడ్రోపవర్ ప్లాంట్లు పెట్టొద్దని కొన్నాళ్ళుగా స్థానిక గిరిజనం ఆందోళన చేస్తుంటే, రహస్యంగా సర్వేలు నిర్వహించి, అడ్డగోలు అనుమతులిచ్చేందుకు సిద్ధపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు సాగుహక్కు పత్రాలు ఇవ్వడం చేతగాని ప్రభుత్వం, దట్ట మైన అటవీ ప్రాంతాన్ని అదానీకి ఎలా కట్ట బెడుతున్నారని ప్రశ్నించారు? జీవనదులపై పవర్ ప్లాంట్ నిర్మాణంతో ,రైవాడ ఆయకట్టు రైతులకు సాగునీటి ప్రశ్నార్థకమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్‌ప్లాంట్‌ల ఏర్పాటును ఎక్కడికక్కడే గిరిజనం అడ్డుకుంటున్నా, ప్రభుత్వం వెనక్కు తగ్గకుండా దూకుడుగా ముందుకు వెళితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. దీనిపై రైవాడ ఆయకట్టు పరిధిలోని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నీటిసంఘాల చైర్మన్లు, ఇతర నేతలంతా ప్రజలను సంఘటితం చేసి పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మారికలో హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణం జరిగితే దేవరాపల్లి మండలంలోని చింతలపూడి, కొండగంగుబూడి, కరకవలస తామరబ్బ కల్యాణగుమ్మి, వీలుపర్తి. పంచాయతీల్లోని అనేక గ్రామాలకు చెందిన ఆయకట్టు భూములు బీడులుగా మారిపోవడం ఖాయమన్నారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యం ఎర్రునాయుడు, ఈశ్వరరావు, వి శోభన, ఎంఎ నారాయణ పాల్గొన్నారు.

23 నుంచి పాలిటెక్నిక్ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కశింకోట : స్థానిక ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కశింకోట, అనకాపల్లి, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారుల పిల్లలు, ఇంకా సంస్థ ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన 50 శాతం సీట్లలో ప్రవేశాల కొరకు ఈనెల 23 నుంచి కాలేజీలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి. ప్రసాద్, ప్రిన్సిపాల్ బి. ఉమాశంకర్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు, ప్రభుత్వ ఉత్తర్వులు 160, 729ల ప్రకారం ఆసక్తి గల విద్యార్థులు కళాశాలకు విచ్చేసి దరఖాస్తులను పూరించి సమర్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ పథకం వర్తిస్తుందన్నారు. కాలేజ్ . అసోసియేట్ ప్రిన్సిపల్ కర్రి శివ, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరిడిమాంబ పండగ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని చిననందిపల్లి గ్రామంలో ఈనెల 29న నిర్వహించనున్న మరిడిమాంబ పండగ పోస్టర్లను ఆదివారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. పండగ రోజున పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడు నాయుడు, చిననందిపల్లి టీడీపీ నాయకుడు పూడి సత్యారావు, టిడిపి సీనియర్ నాయకుడు శరకాన సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలు శాఖ అధికారులు

విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి: అనకాపల్లిలో లీగల్ మెట్రోలజీ, ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించాయి. 17 నకిలీ తూకపు యంత్రాలు స్వాధీనం చేసుకుని, షాపులపై కేసులు నమోదు చేశారు. అనకాపల్లి జిల్లా శారద నగర్, కొత్తూరులో ఆదివారం లీగల్ మెట్రోలజీ శాఖ అధికారులు చేపట్టిన దాడుల్లో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్. సాయి రమేష్, జిల్లా చైర్మన్ డా. హేమంత్ చరపాక ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు.

తనిఖీలను అనకాపల్లి అసిస్టెంట్ కంట్రోలర్ బి. రామచంద్రయ్య, గాజువాక ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నకిలీ తూకపు యంత్రాలు వినియోగించిన వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి తూకపు యంత్రానికి లీగల్ మెట్రోలజీ శాఖ అధికారిక సీల్ ఉండటం తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



21ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని ఎం. జగన్నాధపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2004 బ్యాచ్ పూర్వవిద్యార్థులంతా ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 21ఏళ్ల క్రితం ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకుని, ఉద్యోగం, ఉపాధిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఆత్మీయ సమావేశంలో కలుసుకుని, పాఠశాలలో సందడి చేశారు. ఇటీవల మృతి చెందిన సహచర మిత్రుడు వర్మ, శివ, నాగరాజు, శ్రీనమ్మలకు నివాళు లర్పించారు. తొలుత స్కూల్ ఆవరణలో సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.తమకు విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతికి బాటలు వేసిన అప్పటి గురువులు శ్రీనివాసరావు మాస్టారు, నరసింహ రాజు, లక్ష్మి నారాయణ, సత్తిబాబు మాస్టారలను వెండి షీల్డ్, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆనందంగా పలకరించు కున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి అందమైన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో కృష్ణ వేణి, కాంతి, చిట్టి, లక్ష్మి, అరుణ, వేణు, చిరంజీవి, శ్రీను, నాగేష్, రమేష్, కాసు, లక్ష్మణ, సూరేష్, శివాజీ పాల్గొన్నారు.

ఇసుక డబ్బులు భద్రం



డబ్బులు చూపుతున్న ఆడపా నరసింహామూర్తి

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఇసుక తవ్వకాలు ద్వారా సేకరించిన రూ.15 లక్షలలో ఎటువంటి అవినీతి జరగలేదని,ఈ డబ్బంతా భద్రంగానే ఉందని జనసేన నేత, గ్రామ పెద్దలు అడపా నరసింహమూర్తి స్పష్టం చేశారు. ఆదివారం వడ్డాదిలో సయ్యపురెడ్డి సత్యనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన వద్ద దాచిన రూ.15లక్షలను విలేకరుల సమక్షంలో ప్రదర్శించారు. ఈడబ్బులను తన సొంతానికి ఏనాడు వాడుకోలేదన్నారు గ్రామ అభివృద్ధి కోసం అఖిలపక్ష నేతలు,గ్రామ పెద్దలు అడిగిన మరుక్షణమే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇటీవల సినీ నిర్మాత నట్టి కుమార్ అవగాహన రాహిత్యంతోనే తమపైన, జనసేనపైన ఆరోపణలు చేశారన్నారు నట్టికుమార్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు.గ్రామ ప్రజల కోరిన మీదటే ఈడబ్బును తన వద్ద దాచానన్నారు.తమ తాత, తల్లిదండ్రుల నుంచి దేవాలయాలకు దానధర్మాలు చేశామన్నారు. వడ్డాది జంక్షన్, బంగారు మెట్ట, సంతబయలు ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు నిర్మించామన్నారు వడ్డాది జంక్షన్ లోని మోదకొండమ్మ ఆలయ హుండీ ఆదాయ వివరాలను 30ఏళ్లుగా బహిర్గతం చేయడం లేదని, వాటినివెల్లడించాలన్నారు. .తెలగ, కాపు సంఘం నిధులు, మోదకొండమ్మ పండగ చేయగా మిగిలిన నిధులు, తన వద్ద ఉన్న ఇసుక డబ్బులను సంయుక్తంగా గ్రామ సామాజిక అవసరాలకు, దేవాలయాల అభివృద్ధికి వెచ్చించాలన్నదే తన అభిమతమన్నారు. గ్రామస్తులు అడిగిన మరుక్షణమే రూ.15లక్షలను ఇచ్చేస్తానని, మిగతా వారి వద్ద ఉన్న డబ్బులను కూడా తీసుకురావాలన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో ఆదివారం ఉత్సవ కమిటీ చైర్మన్ విజయమూరి శంకర్, కమిటీ సభ్యులు, శ్రీవారి అక్షయపాత్ర అన్నసమారాధన సేవా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో46వ వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించిన కార్యక్రమంలో 500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కందర్ప రమణమూర్తి, దేవరపల్లి వెంకటఅప్పారావు, వార్డు మెంబర్ తానవరపు శ్రీనివాస్, సకురు కోటేశ్వరరావు, పప్పు శ్రీను, యలక మల్లిబాబు, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కింతాడ భూఅక్రమాలపై సమగ్ర విచారణ



మాట్లాడుతున్న బాధితులు

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని కింతాడ రెవెన్యూ పరిధిలో భూకబ్జాలు, అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఆదివారం ఉదయం కింతాడ గంగాదేవి ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ, భూములు కబ్జా చేసి బ్యాంకుల నుండి రుణాలు పొందిన కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు, ఇతరులతో పాటు అందుకు సహకరించిన రెవెన్యూ, బ్యాంకు అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కింతాడ రెవెన్యూకు చెందిన 11 మంది వ్యక్తుల భూములతో పాటు ప్రభుత్వ భూమి కూడా తనఖా పెట్టి బ్యాంకు రుణం పొందారని ఆరోపించారు. సర్వే నెంబరు 68/1లో భూమిని కోపరేటివ్ బ్యాంకులో తనఖా పెట్టి రూ.1.13 కోట్ల రుణం పొందారనిచనాలుగైదు బ్యాంకుల్లో సుమారు రూ. 3 కోట్ల పైబడి రుణాలు పొంది ఉన్నారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదుచేసి నెలన్నర కావస్తున్నా ఎటువంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బండారు నరసింహనాయుడు, అతని అనుచరుల నుంచి 11 మంది బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా నరసింహనాయుడు తప్పును తెలుసుకొని తమ భూములను తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని బాధిత కుటుంబాలు కోరాయి. సమావేశంలో బండారు గంగా శ్రీనివాసరావు, కిలపర్తి అప్పలనాయుడు, కుబిరెడ్డి సన్నిబాబు, కుబిరెడ్డి అర్జున, దేముడు, బండారు అప్పలనాయుడు (బాబు), పలువురు మహిళలు పాల్గొన్నారు.

పునర్వినియోగ పదార్థాలను ప్రోత్సహించాలి



చిత్రలేఖనం పోటీల్లో విజేతలతో పీలా నాగశ్రీను

ప్రజాశక్తి- అనకాపల్లి : పునర్వినియోగ పదార్థాలను అందరూ ప్రోత్సహించాలని నూకాంబికా దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం గౌరీ గ్రంథాలయంలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ అంశాలపై చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీటిని భూమి లోపల నిల్వ చేసే విధానాలను అభివృద్ధి చేయాలన్నారు. కళాత్మకతతో, భావోద్వేగంతో, ప్రకృతిని రక్షించాలనే సంకల్పంతో గ్రీన్ క్లబ్ చిత్ర లేఖనం పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. పోటీలకు ఎంచుకున్న అంశాలు సమాజానికి అవసర మన్నారు. సృజనాత్మకత, కళాప్రతిభలను ప్రదర్శించడానికి చిత్ర లేఖనం పోటీలు దోహద పడతాయన్నారు. పరీక్షలు, మార్కుల కన్నా చిత్రలేఖనం పోటీలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని పీలా నాగశ్రీను అన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, శ్రీ భోగలింగస్వామి దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), అండ్రూష్, నైశెట్టి సత్తిబాబు, బీరా వినోద్‌కుమార్, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.

చిత్ర లేఖనం పోటీల విజేతలు

కిడ్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తతీయ, బహుమతులను కే.రోహిత్ కుమార్, డి.మోక్షిత, ఆర్నవి సాధించగా జూనియర్స్ విభాగం వై హేమలత, పి.మనస్వి, సి.హైందవి పొందారు. సీనియర్స్ విభాగంలో డి.హేమంత్ సాయి, వి.జహ్నవి, కే.నివాస్ ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను సాధించారు.

కౌలు రైతుల గుర్తింపులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి -.అనకాపల్లి : వ్యవసాయక పనులు ముమ్మరం కావస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం మాత్రం కౌలురైతుల గుర్తింపునకు ఎటువంటి చర్యలు ఇంతవరకు చేపట్టకపోవడం శోచనీయమని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బాలు గాడి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కౌలురైతుల దిక్కుతోచక అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఉన్నా సరే మార్చి నుండి మే మధ్య కాలంలో వ్యవసాయ, రెవిన్యూ శాఖ సంయుక్తంగా గ్రామ సభలు నిర్వహణకు ప్రణాళికలు వేసుకునేవన్నారు. అయితే ఈ ఏడాది నేటి వరకు ఇప్పుడు అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలురైతుల గుర్తింపు చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించారని, ఇది కేవలం ప్రకటన మాత్రమేనని, కొత్త చట్టం తీసుకురావడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. ఏడాది గడుస్తున్నా పాత చట్టం రద్దుచేసి కొత్త చట్టం తీసుకు రాలేదన్నారు. కౌలు రైతుల గుర్తింపు జరగకపోవడం వలన గ్రామాల్లో కౌలు రైతులు విత్తనాలు, ఎరువులు కొరకు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కౌలురైతుల గుర్తింపుకు అత్యవసరంగా చర్యలు చేపట్టి గుర్తింపు కార్డులు మంజూరు చేసి రాబోయే అన్నదాత సుఖీభవ పథకంలో భూమిలేని కౌలురైతులకు కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయం అందించాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బాలు గాడి కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని బాలరేవుల ఘాట్‌లో ఆదివారం మంప ఎస్ఐ కె.శంకరరావు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల జరిగిన ఎదురు కాల్పులు, మావోయిస్టుల సంచారం అంటూ ఇంటిలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సోదాలు చేశామని ఎస్సై తెలిపారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

అధ్వాన రోడ్డును పట్టించుకోరా?

- నిండా గోతులతో చోడవరం, అనకాపల్లి రోడ్డు
- అవస్థలు పడుతున్న జనం, వాహనదారులు
- అటూ, ఇటూ ఎమ్మెల్యేలు ఉన్నా పట్టని వైనం



నిండా నీరు నిండిన గోతులతో అధ్వానంగా ఉన్న చోడవరం, అనకాపల్లి రోడ్డు

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్ : గత వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండేదని అప్పట్లో విపక్షంలో ఉన్న టిడిపి, జనసేన కూటమి నేతలు గగ్గోలు పెట్టారు. రోడ్లకు సంబంధించి ఏకంగా జగనన్న రోడ్లు అనే ట్యాగ్‌ను కూడా బాగా ప్రచారంలోకి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ వైఫల్యాలలో దాన్నే ప్రధానంగా జనాల్లోకి తీసుకెళ్లారు. అభివృద్ధి లేదంటూ హడావిడి చేసేవారు. మరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతేకాక కేంద్రంలోని బిజెపితో భాగస్వామ్యంగా ఉంది. అయినా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కొన్ని ప్రధాన రహదారులను పూర్తిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో చోడవరం, అనకాపల్లి ప్రధాన రహదారిని ప్రధానంగా చెప్పుకోవచ్చు.

వాహన రాకపోకలు సాఫీగా చేసేవీలు లేనంతగా అనకాపల్లి చోడవరం ప్రధాన రహదారి నిండా గోతులమయమై వాహనదారులకు నరకాన్ని చూపిస్తోంది.మోకాలిలోతుకు మించిన గోతులు, ఎక్కడికక్కడే పూర్తిగా చెదిరిపోయి రూపుకోల్పోయిన తారురోడ్డు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. పగటిపూట అయితే, గోతుల రహదారిలో అటూఇటూ పాములా కదులుతూ, వాహన రాకపోకలను ఇబ్బందులతో సాగించే వీలున్నా, చీకటి పడ్డాక ఇక నరకమే.. చిమ్మ చీకటిలో రోడ్డుపై ఎక్కడ ఎంతపెద్దగొయ్యి ఉందో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అనకాపల్లి, చోడవరం మధ్య కేవలం ఇరవై కిలోమీటర్ల దూరం ఉండగా, ఇరువైపులా ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రహదారి మీదుగానేవీళ్ల రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక నిత్యం వేలాదిమంది విద్యార్థులు ఉద్యోగులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తూ ఉంటారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి పరిస్థితి బాగుపడుతుందని ఈ మార్గంలోని పలు గ్రామాల ప్రజలు ఆశించినా, వారికి నిరాశే మిగిలింది. గడచిన సంక్రాంతి నాటికి రోడ్లపై గోతులనేవి కనిపించ కూడదంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని చర్యలు చేపట్టగా, వీటి వల్ల కొన్ని రోడ్లు బాగుపడినా, అనకాపల్లి, చోడవరం రోడ్డు దుస్థితిపై ఎవరూ దృష్టిపెట్టకపోవడం శోచనీయం.ని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, గ్రామాల రూపురేఖలు మారిపోతాయని ఎన్నికలకు ముందు, తర్వాత కూటమి నేతలు పెద్దగా ప్రచారం చేసినా, చోడవరం, అనకాపల్లి రహదారివైపు అవేవీ అమలుకాకపోవడం శోచనీయం. ఇప్పటికైన ఇరువైపులా ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు ఈ రోడ్డు దుస్థితిపై దృష్టిపెట్టి, బాగుచేయించి, ప్రజల కష్టాలను తీర్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

టేబుల్ టెన్నిస్‌లో మోహితాక్షిత సత్తా

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు ఎపి జెన్‌కో సివిల్ విభాగంలో జెఎఒగా పనిచేస్తున్న ఎం జోగారావు కుమార్తె మోహితాక్షిత జిల్లా స్థాయిలో అండర్-13 విభాగం టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్(విటిటిటిఎ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అండర్ 13 విభాగంలో సీలేరుకు చెందిన మోహితాక్షిత చక్కటి ఆట తీరు కనరిచి ఫైనల్‌కు చేరుకుంది. అనంతరం సాన్వికతో తలపడి 3-1 సెట్ స్కోర్ తో గెలుపొంది ప్రథమ స్థానంలో మోహితాక్షిత నిలిచింది. విశాఖపట్నం అక్కయ్య పాలెం బ్రాంచ్ నారాయణ పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతి చదువుతున్న సీలేరుకు చెందిన మోహితాక్షిత జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రథమ స్థానం పొందడంతో స్థానిక ఏపీ జెన్కో అధికారులు ఇంజనీర్లు తండ్రి జోగారావు అభినందించారు.

ఘనంగా వీరుడిమాంబ పండగ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో వీరుడిమాంబ అమ్మవారి ఒడ్డు పండగను చల్లా మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. భక్తి పాటలకు మహిళలు నెత్తిపై ఘట్టాలు పెట్టుకొని ప్రదర్శించిన కోలాట నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారిని జెడ్‌పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, ఎంపిటిసి పంచాడ సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

ప్రణాళికతో పోటీ పరీక్షల్లో విజయం

- దేశ పాలన, సంక్షేమం అమలులో యుపిఎస్‌సి కీలకం
- కేంద్ర అదనపు స్టాండింగ్ కౌన్సిల్ రాజగోపాల్

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశాభివృద్ధి, పాలన, సంక్షేమ పథకాల అమలు, మార్పులకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కీలకమని కేంద్ర ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్, సీనియర్ న్యాయవాది బి.ఎస్.వి.రాజుగోపాల్ అన్నారు. గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో గ్రంథాలయంలో సివిల్స్, గ్రూప్-1లపై అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలన్న సంకల్పం సివిల్స్, గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించడం ద్వారా చేయవచ్చని స్పష్టం చేశారు. లాజికల్ థింకింగ్, ప్రాబబిలిటీ, న్యూమరికల్ అబిలిటీ వంటి అంశాలపై పోటీ పరీక్షల ఔత్సాహికులు నైపుణ్యం సాధించాలన్నారు. శీఘ్ర గణనా పద్ధతులు (షార్ట్‌కట్స్), ట్రిక్స్ నేర్చుకోవడం ద్వారా పరీక్షల్లో సమయం ఆదా చేయవచ్చన్నారు. నిత్య అధ్యయనం, మాక్ టెస్టులు, సమయ పాలన విజయానికి కీలమన్నారు. పరీక్షల వల్ల అనలిటికల్ మైండ్‌ను మెరుగుపరచుకోవచ్చని రాజుగోపాల్ అన్నారు. వైఫల్యాలు సహజమని, తట్టుకుని పట్టుదలతో ప్రయత్నిస్తే గెలుపు తథ్యమన్నారు. వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరక్టర్ గౌతమ్ పోతల మాట్లాడుతూ స్టడీ గ్రూప్స్‌లో చేరడం వల్ల విద్యార్థుల ఆలోచనల మార్పిడి జరుగుతుందన్నారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు సుదీర్ఘకాల అధ్యయనం, సహనం, నిరంతర కృషి అవసరమన్నారు. సివిల్స్ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ప్రతిష్టాత్మక పదవుల్లోను, గ్రూప్-1 ద్వారా డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఒ, ఆర్డీవో వంటి కీలక ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ఈ పరీక్షలు ప్రాథమిక దశ ప్రిలిమ్స్, తదుపరి మెయిన్స్, చివరగా ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. సివిల్స్, గ్రూప్1ల సిలబస్ విస్తతంగా ఉంటుందని, అధ్యయనంలో ప్రాధాన్యతను నిర్ణయించు కోవాలన్నారు. తాజా వార్తలు, ప్రభుత్వ పాలసీలు, చట్టాలు, ఆధునిక భారతదేశ చరిత్ర, రాజ్యాంగం, ఆర్థికశాస్త్రం, భూగోళశాస్త్రం, పాఠ్యపుస్తకాలు, పత్రికలు, ప్రస్తుత వ్యవహారాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. ఈ సందర్భంగా సివిల్స్, గ్రూపు-1 పరీక్షల ప్రాధాన్యత, అర్హత, పరీక్ష, సిలబస్, దేశ పాలనలో సమర్థత, ప్రజా సేవ, పాలసీల అమలు, దేశాభివద్ధి, న్యాయం, సమర్థవంతమైన పరిపాలన అంశాల గురించి పీపీటీ ద్వారా వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరక్టర్ గౌతమ్ పోతల వివరించారు. యుపీఎస్‌సీ-2025 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస మాట్లాడుతూ దేశంలో మేటి కేంద్ర కొలువులకు యూపీఎస్‌సీ అని తద్వారా ముఖ్యమైన ఉద్యోగ నియామకాలు జరుగుతా యన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు దేశంలో మార్పును తీసుకురాగల శక్తి ఉంద న్నారు. సరైన ప్రణాళిక, పట్టుదల, సాధనతో సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి, శిక్షణ ఎలా పొందాలి, సమయ పాలన, ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం ఎలా తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో యూపీఎస్‌సీ (సివిల్స్)పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని, భవిష్యత్‌లో నోటిఫికేషన్లకు అనుగుణంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, బోధకురాలు పి.గాయత్రి, నైస్ మేన్ పవర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ పి.రమేష్‌బాబు, సదస్సు సమన్వయకర్తలు మళ్ల బాపు నాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, గ్రంథాలయ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ.) పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ రాజుగోపాల్

ఉపాధి హామీ పనులు కల్పించాలని ..

ఆదివాసీల వినూత్న ఆందోళన



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, ఆదివాసీలు

ప్రజాశక్తి-కొత్తకోట: అదివాసి గిరిజన గ్రామాలకు రహదార్లు, ఉపాధి హామీ కూలీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రావికమతం మండలం చీమలపాడు శివారు నేరేళ్ళుబంద, జీలుగులోవ, సోంపురం గ్రామాలకు చెందిన పలువురు ఆదివాసీ గిరిజనులు ఆదివారం గుర్రాలతో వినూత్న ఆందోళన చేసారు. ఈ సందర్భంగా పివీటిజీ సంఘం మండల శాఖ అధ్యక్షులు కొర్ర మహేష్, కార్యదర్శి కిల్లో సూరిబాబు తదితరులు మాట్లాడుతూ, తమ గ్రామాల్లో పీవీటీసీ కొంధు గిరిజన గ్రామాలకు రోడ్లు సదుపాయాలు లేవన్నారు. ఉపాధి హామీ కూలి పనులు లేక కుటుంబాలతో పలు ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మూడు గ్రామాలలో సుమారు 14 మంది వరకు జాబ్ కార్డులు ఉన్నప్పటికీ స్థానికంగా కూలి పనులు కల్పించలేదన్నారు. స్థానికంగానే కూలి పనులు కల్పించాలని డిమాండ్ చేసారు. గ్రామాల్లో అధికంగా ఫారెస్ట్ పట్టా భూములే ఉన్నాయని, తమ ప్రాంతంలో కాకుండా వేరే చోట ఉపాధి పనులకు అధికారు లు పిలుస్తున్నారని తమ ప్రాంతంలోనే తమకు కూలి పని కల్పించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నప్పటికీ స్పందించ కుండా 10కి.మీ దూరంలో ఉన్న గ్రామాలకు పనికి వెళ్లమంటున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంట పొలాల్లో రాతి కట్లు, ఫారం పాండ్, ట్రెంజ్ కాలువలున్నాయని, అక్కడే పనులిస్తే తమ భూములు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల్లో పనులు లేకపోవడంతో కొంతమంది గ్రామాలు, కుటుంబాలను విడిచి ఇతర ప్రాంతాలకు వలస పోయి కోళ్ల ఫారాలలో పనులు చేసుకుంటున్నారని వాపోయారు. ఈ సమస్య లపై గతంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైె నా అధికారులు స్పందించి తమ గ్రామాలకు రహదారి సౌకర్యం, ఉపాధి కూలి పనులు కల్పించాలని కోరారు. లేదంటే ఈ నెల 24న గుర్రాలతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నేతలు

చోడవరం సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలి

ప్రజాశక్తి-రావికమతం: చోడవరం షుగర్ ఫ్యాక్టరీని రక్షించాలని ఆ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కే.భాస్కరరావు కోరారు. ఈ సందర్భంగా రావికమతం చెరువు కాటా వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి రావికమతం, చినపాచిల, తట్టబంద చెరుకు కాటాలకు సంబంధించిన కార్మికులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ, ప్రస్తుతం చోడవరం షుగర్ ఫ్యాక్టరీ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు నుంచి బయట పడడానికి రైతులు, కార్మికులు శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఫ్యాక్టరీ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సంతకాల సేకరణతో తెలియపరచాలని నిర్ణయించామన్నారు. రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను నేటికీ చెల్లించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే సీజన్లో ఫ్యాక్టరీ యధావిధిగా సక్రమంగా పనిచేస్తుందన్న భరోసాను రైతులకు కల్పించాల్సిన అవసరం ఫ్యాక్టరీ యాజమాన్యం పైన, ప్రభుత్వం పైన ఉందన్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ చైర్మన్, ఎండి, చోడవరం, మాడుగుల శాసనసభ్యులు, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు అందరూ స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గంజి సత్యనారాయణ, శ్రీను, గుమ్మాల అప్పారావు, మజ్జి నాగేశ్వరరావు, వేపాడ రామనాయుడు, రైతులు ఫీల్డ్ మ్యాన్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పేపర్ క్రాఫ్ట్ ప్రదర్శన

-కొనసాగిన వేసవి శిబిరాలు



విద్యార్థులు తయారుచేసిన ఆర్టికల్స్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్ర మంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు రంగబాబు విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పై శిక్షణ ఇచ్చారు. రంగుల పేపర్లతో వివిధ బొమ్మలు తయారు చేయు విధానాన్ని తెలియజేశారు. ఈ మేరకు పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో రంగురంగుల పేపర్లతో పుష్పగుచ్చాలు, ఇళ్లకు అలంకరించి ఆర్టికల్స్, బాల్స్,ఫోటో ఫ్రేమ్, పువ్వుల స్టాండ్, చిన్న చిన్న బొమ్మల తయారు చేసి, ప్రదర్శించారు.

కోటవురట్ల: విద్యార్థులు చదువులతో పాటు ఆటల పైన దృష్టి సారించాలని శాఖ గ్రంథాలయ అధికారి విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పద్య పోటీలతో పాటు వివిధ అంశాలపై డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



మల్కాపురంలో...



కోటవురట్లలో ...

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారమూ కొనసాగింది. భారత స్వతంత్ర సంగ్రామం జరిగిన తీరును కథల రూపంలో పిల్లలకు వివరించారు. పిల్లల చేత నీతి కథలను చెప్పించారు. ప్రపంచంలోని వివిధ దేశాల సమాచారానికి సంబంధించిన విజ్ఞానాన్ని బాలలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ

నేడు టిడిపి మినీ మహానాడు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఘాట్ రోడ్ జంక్షన్‌లో ఈనెల 19న సోమవారం నిర్వహించే మాడుగుల నియోజకవర్గ టిడిపి మినీ మహానాడును విజయవంతం చేయాలని దేవరాపల్లి మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడునాయుడు కోరారు. ఆదివారం రైవాడ జలాశయ అతిథి గృహం నందు విలేకర్లతో పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ మాట్లాడుతూ.. టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి మినీ మహానాడును జయప్రదం చేయాలని కోరారు. దేవరాపల్లి మండలం నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు మినీ మహానాడులో పాల్గొననున్నారని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, టిడిపి సీనియర్ నాయకులు శరకాన సూర్యనారాయణ, కర్రి నాయుడు, చిన్నారావు, శెట్టి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చోడవరం లక్ష్మమ్మ గుడి వద్ద ఈనెల 19న సోమవారం మధ్యాహ్నం జరిగే చోడవరం నియోజక వర్గం మినీ మహానాడును విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.



భోజనాలు చేస్తున్న భక్తులు

ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో రేబాక గూడుపమ్మ తల్లి ఆలయ ప్రాంగణం ఆదివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకుని భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

టిడిపి గ్రామ అధ్యక్షునిగా అప్పారావు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని ఎల్ సింగవరం టిడిపి గ్రామ అధ్యక్షునిగా గ్రామానికి చెందిన కలవలపల్లి అప్పారావును టిడిపి కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షునిగా రెల్లి గణేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వేపాడ మధు తదితరులు పాల్గొన్నారు.



అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 19వ తేదీ నుండి జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నరేష్ తెలిపారు. ఇందుకుగాను రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నక్కపల్లిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, రెసిడెన్షియల్ స్కూల్‌లో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయని వెల్లడించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరవ్వాలన్నారు.



మాకవరపాలెంలో పూర్తికాని భవనం

పూర్తికాని సచివాలయ భవనాలు

-ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది

ప్రజాశక్తి- కోటవురట్ల: మాకవరపాలెం మండలంలో మండల కేంద్రం సహా బూరుగుపాలెం, తూటిపాల, పిపి అగ్రహారం గ్రామాలలో సచివాలయ కేంద్రాల నిర్మాణాలు పూర్తి కాలేదు. నిర్మాణాలు ప్రారంభించి సుమారు ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికి భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో సచివాలయ భవనం దాదాపు పూర్తికావచ్చినా ప్లంబింగ్, డోర్స్ పనులు పూర్తి కాలేదు. దీంతో, గడచిన మూడు సంవత్సరాలుగా వృథాగా పడి ఉంది. సచివాలయలలో వివిధ సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఆయ గ్రామాలలో పాత పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

ఈ విషయమై సంబంధిత డిఈ ఈశ్వరరావును వివరణ కోరగా... భవన నిర్మాణాలు దాదాపు పూర్తి కా వచ్చాయని, నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. అంచనాలను రూపొం దించి సంబంధిత శాఖ అధికారులకు విన్నవించామని నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని తెలిపారు.



కురుస్తున్న వర్షం

పలు ప్రాంతాల్లో భారీ వర్షం

ప్రజాశక్తి -కోటవురట్ల:ఆదివారం ఉదయం నుంచి ఎండ వేడిమితో ఉన్న వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. వర్షానికి రోడ్లు జలమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పెదబయలు: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు ఎండా కాసింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో వివిధ ప్రాంతాల నుండి వ్యాపారానికి వచ్చిన తెచ్చిన వస్తు సామాగ్రి తడిసి ముద్దయ్యింది. దీంతో వ్యాపారస్తులు నానా ఇబ్బందులకు గురయ్యారు. వర్షంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మెయిన్ రోడ్డు బురద మయంగా మారింది.చెత్తా చెదారం మెయిన్ రోడ్డుపైకి ం రావడంతో బురదగా మారింది. దీంతో వ్యాపారాలు, స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.పంచాయతీ అధికారులు స్పందించి మోదకొండమ్మ జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకములు కలగకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు

▸▸ మందు బాబులకు సకల సౌకర్యాలు ▸▸ పట్టించుకోని అధికారులు

ప్రజాశకి -రావికమతం:మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. మండల కేంద్రం, తట్టబంద, కొత్తకోట, అర్జాపురంలో మద్యం షాపులు ఉన్నాయి. ఈ షాపుల ఆధ్వర్యంలో గొంప, గుడ్డిప, తోటకూర పాలెం, మేడివాడ, గర్నికం, మరుపాక, మత్సవానిపాలెం, పొన్నవోలు, దొండపూడి, కన్నంపేట, చినపాచిల, మర్రివల, జెడ్ కొత్తపట్నం, గంపవానిపాలెం తదితర గ్రామాలలో విచ్చలవిడిగా అనధికార బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపులు నిర్వహించకూడదన్న నిబంధనను పక్కన పెట్టి వైన్ షాప్ యజమానులు దర్జాగా గ్రామాలలో మద్యం బెల్టు షాపులను ఏర్పాటు చేశారు.

మెయిన్ షాపుల పక్కనే ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. మందుబాబులకు టేబుల్స్, చైర్లు ఏర్పాటు చేసి, అమ్మకాలు ఏర్పాటు చేస్తూ వారికి సకల సౌకర్యాలను షాపు పక్కనే కల్పిస్తున్నారు. దీంతో పూటుగా మద్యం సేవించిన మందుబాబులు మాటా, మంతిలో వారు రకరకాల కారణాలతో గొడవలు, ఘర్షణలకు దిగుతున్నారు. గ్రామాలలో కుటుంబ యజమాని ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పనిచేసిన డబ్బులు సాయంత్రం మద్యానికే కేటాయించడంతో పోషణ చాలా కష్టతరం అవుతుందని పలు గ్రామాలకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మార్పీ ధరలకంటే ఒక్క రూపాయి కూడా పెంచకూడదన్న ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని వైన్ షాప్ యజమానులు బేఖాతర్ చేస్తూ రూ.160 ఉన్న బాటిల్ను 200లకు, రూ.100 ఉన్న బాటిల్ను 130, రూ.130 బాటిల్ను 160కు, రూ.190 బాటిల్ను 250లకు అమ్మకాలు జరుపు తున్నారు. ఎంఆర్పి ధర కంటే అధికంగా ప్రతి బాటిల్ వద్ద 50 రూపాయలు అధికంగా ధర విధించి అమ్మకాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం మాడుగుల ఎక్సైజ్ పోలీసులు, అధికారులు ఎటువంటి దాడులు చేపట్టకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా గ్రామాలలో ఉన్న బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించాలని, షాపుల వద్ద ప్రత్యేక గదులను తక్షణమే తొలగించాలని పలు గ్రామాలకు చెందిన మహిళలు ప్రజలు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



మద్యం తాగుతున్న మందుబాబులు

అస్తవ్యస్త రహదారితో అవస్థలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని ఇరగాయి పంచాయతీ మారుమూల గాతపాడు, నంద గ్రామానికి రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు నానా తంటాలు పడుతున్నారు. గ్రామం దట్టమైన అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు. అభివృద్ధి కి ఆమడ దూరంలో గ్రామం ఉంది. ఈ గ్రామంలో ఎలాంటి సౌకర్యాలు లేక గ్రామస్తులు అష్టకష్టాలు పడుతున్నారు.

ఇరగాయి పంచాయతీకి రావాలంటే కాలి నడకే దిక్కని గ్రామస్తులు వాపోతున్నారు. ఇరగాయి గ్రామ పంచాయతీ కేంద్రానికి 16 కిలోమీటర్ల దూరంలో నంద గ్రామం ఉంది. ఇరగాయి, తోటవలస నుండి గాతపాడు మీదుగా నంద దారి మట్టి రోడ్డే దిక్కు. చుట్టు కొండలు, రోడ్డు లేక కాలినడకన వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. 25 ఐదేళ్ల క్రితం వేసిన మట్టి రోడ్డు దిక్కుగా మారిందని, తర్వాత



రాళ్లు తేలిన రహదారి



అవస్థలు పడి వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు

తారు రోడ్డు వేయలేదన్నారు. దీంతో ఎలాంటి వాహనాలు గ్రామానికి రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం జిల్లా పాచిపెంట మండలానికి వివిధ పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు.

ఎన్నికల సమయంలో గ్రామంలో రాజకీయ నాయకులు వచ్చి ఓటెయ్యండి మీకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని చెప్పి తీరా అధికారంలో వచ్చాక గ్రామ వైపు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నందకు రోడ్డు తారు రోడ్డు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, నాయకులు, వేడుకుంటున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి -అనంతగిరి:

పశుసంవర్ధక శాఖ బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు, నిబంధనల మరకే బదిలీల ప్రక్రియ జరగాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పశు సంవర్ధక శాఖ అధ్యక్షులు సాగరి. గణేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలన్నారు. బదిలీల్లో గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతిసారి అన్యాయం జరుగుతుందని అన్నారు.నిబంధనల మేరకు గిరిజన ప్రాంతంలో అత్యధిక ఉద్యోగులు కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీల్లో అవకతవకలు జరగకుండా నిబంధన మేరకే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా పశుసంవర్ధక శాఖ సంఘం అధ్యక్షులు డాక్టర్ శివ రామకృష్ణారావు, అనకాపల్లి జిల్లా పశు వైద్య అధికారి ఎల్ .రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేశ్వరరావు